# నరరూప రాక్షసుడు

తండ్రి తన బిడ్డను గుండెల మీద ఆడిస్తూ వాడి భవిష్యత్తు గురించి ఎన్నో కలలు కంటాడు. వాడు తన పసి పాదాలతో తండ్రి గుండెల్ని తంతూ వుంటే ఆ తండ్రి ఆనందముతో మైమరచిపోతాడు. తన బిడ్డ తన కంటే గొప్పవాడు కావాలనేదే ప్రతి తండ్రి కోరిక. ఆ తండ్రి కూడా కొడుకుని అపురూపంగా పెంచాడు. కోరిన ప్రతి చిన్నా పెద్దా కోరికను తీర్చాడు. తన బిడ్డకు ఎటువంటి బాధా కలగకూడదనుకొన్నాడు. కాని దానికి ప్రతిఫలంగా ఆ కొడుకు తండ్రికి ఇచ్చిన ప్రతిఫలం ఏమిటి?

సంజె చీకట్లు ముసురుతున్నాయి.

పడమటి దిక్కున సూర్యబింబం ముత్తైదువు నొసటి కుంకుమ బొట్టులా ఎర్రగా వుంది.

అది గుజరాత్ రాష్ట్రంలోని రాజ్‌కోట్ నగరం రేసు కోర్సు గ్రౌండ్ సమీపంలో వున్న ఆ ప్రాంతానికి ఓ ప్రత్యేకత వున్నది. ఇంగ్లీషు రాజ్యంలో ఆమైదానంలో గుర్రపు పందాలు జరిగేవి. కాని ఇప్పుడు ఆ మైదానం యువదంపతులకూ, ప్రేమజంటలకు విహార స్థలంగా మారింది. ఆ మైదానంలో సాయంకాలం జనం కొందరు జంటలు జంట లుగా, కొందరు వంటరిగా, కొందరు తిరుగుతూ, కొందరు కూర్చుని వున్నారు. పిల్లలు ఆడుకుంటున్నారు.

1981 ఫిబ్రవరి 23వ తేదీన ఆ భవనాల లోని ఒక భవనం "మధుకుంజ్" నుంచి ఆర్తనాదం వినిపించింది. ఆడవాళ్ల ఏడుపులు మగవాళ్ల అరుపులూ వినిపించాయి. దారిన వెళ్ళేవాళ్ళు నిలబడిపోయారు. మైదానంలోని జనం పరుగులు తీశారు. ఇరుగు పొరుగు వాళ్ళు ఇళ్ళ లోంచి బయటికి వచ్చారు.

ఆ సమీపంలోనే రెండు సినిమా హాల్స్ కూడావున్నాయి. అనేక అంతస్థుల భవనాలు వున్నాయి. ఒక పెద్ద పోష్ హొటల్ కూడావుంది.

ఆ దగ్గరలోనే వున్న డాక్టర్ యాజ్ఞిక్ మార్గంలో అనేక అంద మైన భవనాలు వున్నాయి. ఆ భవనాలు అక్కడ నివసించే వారి వైభ వాన్నీ, అంతస్థునూ మౌనంగానే తెలియ చేస్తున్నాయి.

"మధుకుంజ్'' యజమాని అడ్వకేట్ భట్‌ను ఎవరో చంపి పారిపోయారని తెలిసింది. ఆచంపినవాడు చేతిలోని కత్తిని పారెయ్యాలనే ధ్యాస కూడా లేకుండా పారిపోవడం కొందరు చూశారు.

ఒక ఆటోరిక్షా డ్రైవరు పెట్రోలింగ్ పోలీసుకు ఒక యువకుడు రక్తంతో తడిసి ఎర్రగా ఉన్న కత్తి పట్టుకొని అంతకు ముందే పారి పోయాడని చెప్పాడు. పెట్రోలింగ్ పోలీసు ఆ యువకుడ్ని వెతుక్కుంటూ ఆటో డ్రైవర్ చెప్పిన దిశగా వెళ్ళింది. వీరాణీ హైస్కూల్ దరిదాపుల్లో పోలీసు ఆ యువకుడ్ని పట్టేసింది. ఆ యువకుడి చేతిలో రక్తరంజిత మైన కత్తి అలాగే వుంది.

ఆ యువకుని పేరు తెలుసుకొన్న పోలీసులు విస్మయంలో మునిగి పోయారు. ఆ యువకుని పేరు మహేంద్రభట్. అతను వకీల్ ఛోటా లాల్‌భట్ పుత్రుడనీ, అతనే తండ్రిని హత్య చేశాడనీ తెలుసుకొన్న ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు.

పోలీసులు రంగంలోకి దిగారు. శవాన్ని పోస్టుమార్టంకు పంపించారు. ఇంట్లో వున్న వాళ్ళను అనేక ప్రశ్నలు వేశారు.

వకీల్ భార్య మధుకాంత, అతని పెద్ద కూతురు పిచ్చివాళ్ళై అయిపోయారు. పోలీసులకు సమాధానం చెప్పే స్థితిలో లేరు. భట్ చిన్న కొడుకు మహేంద్ర అవారాగా తిరుగుతాడని అందరికీ తెలుసు. కాని ఒక ఉన్నత కుటుంబంలో పుట్టి, మంచికి మారు పేరుగా గుర్తించ బడే తన తండ్రినే చంపగల పశువు అతనిలో కొమ్ములు విసురు తున్నదని ఎవరూహించగలరు ?

రెండో రోజు ఉదయం అన్ని పత్రికల్లో ఈ హత్య గురించిన వార్త ప్రముఖంగా ప్రచురించబడింది. శ్రీ భట్‌కు సమాజంలో పెద్ద పేరు వుంది. ఎందరితోనో పరిచయం వుంది. రాజ్‌కోట్‌లో ఆయన పేరు తెలియనివారు బహు అరుదు.

మహేంద్రను జైలుకు పంపించారు. కోర్టులో కేసు ప్రారంభం అయింది.

శ్రీమతి భట్, ఆమె పెద్ద కూతురు కోర్టులో ఇచ్చిన సాక్ష్యాలను బట్టి మహేంద్ర చేతిలో ఎప్పుడో ఒకప్పుడు తండ్రి హత్యకు గురి అయ్యే వాడేనని అందరికీ అన్పించింది.

శ్రీ భట్ జూనాగఢ్ ఎస్టేట్‌లో లీగల్ అడ్వైజరుగా జీవితం ప్రారంభించాడు. ఆ ఎస్టేట్ దీవాన్ చనిపోయాక శ్రీభట్‌ను దీవానుగా నియమించడం జరిగింది. జమీందారీ రద్దు తరువాత భట్ రాజ్‌కోట్‌కు వచ్చి వకాలత్ ప్రారంభించాడు అప్పుడే అతనికి ఆచార్య కృపలానితో పరిచయం అయింది.

1950-51 ప్రాంతంలో భట్ సౌరాష్ట్రంలో "కిసాన్ మజ్‌దూర్

పార్టీ"ని స్థాపించారు. అదే సంవత్సరం ఆ పార్టీ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేసి ఓడిపోయాడు. ఆతర్వాత ఆయనకు రాజకీయాలలో అభిరుచి పోయింది. వకీలుగా స్థిరపడ్డాడు.

ఆయనకు ఇద్దరు కొడుకులు - ఆరుగురు కూతుళ్ళు. పెద్ద కొడుకు మధు మనస్థిమితం లేనివాడు. నలుగురు కూతుళ్ళకు వివాహాలు చేశాడు. చిన్న కొడుకు మహేంద్రను తల్లిదండ్రులు అపురూపంగా చూసుకునేవారు. వాడు దేనికీ బాధపడ కూడదు. అతి గారాబంతో పెరిగిన మహేంద్రకు ఉన్నత విద్య అలవడలేదు. ఇంటర్‌తోనే చదువుకు స్వస్తిచెప్పాడు. మహేంద్ర టీన్‌ఏజ్‌లో అడిగినంత డబ్బు చేతికి అందడంతో, అతని చుట్టూ అనేక గ్రహాలు చేరాయి. ఇరవై ఏళ్ళు నిండేసరికి అతనికి లేని దురలవాటు లేదు.

రౌడీలతో తిరుగుతూ వుండేవాడు. ఆ విషయం తెలిసిన తల్లిదండ్రులు మానసికంగా కృంగిపోసాగారు. తండ్రి నయాన, భయాన మహేంద్రకు చెప్పిచూశాడు. లాభం లేదని గ్రహించిన తండ్రి కొడుక్కు డబ్బు యివ్వడం తగ్గించాడు.

మహేంద్ర ఇంటికి రావడం మానేశాడు. మరీ డబ్బు అవసరం అయినప్పుడు మాత్రమే వస్తూ వుండేవాడు. చివాట్లు పెట్టి ఎంతో కొంత డబ్బు ఇచ్చి తండ్రి కొడుకు బెదడ వదిలించుకొనేవాడు.

అప్పుడప్పుడు మహేంద్ర అద్దె ఆటో రిక్షా నడుపుతూ వుంటాడని తండ్రికి తెలిసింది. ఆ తండ్రి మనసు అవమానంతో భగ్గుమన్నది. కాని ఏమీ చేయలేని స్థితి. కొడుకుని కౌగిలించుకొని తల్లి కన్నీరు మున్నీరుగా ఏడ్చేది. మహేంద్ర మనసు కొంచెం కూడా కరిగేది కాదు.

ఒకసారి ఇంటికి వచ్చాడు. రెండు రోజులు వున్నాడు. చాలా

మౌనంగా, పశ్చాత్తాపం పడుతున్నట్టున్న కొడుకుని చూసి ఆ తల్లి దండ్రుల మనసులు ద్రవించాయి. అయినా తండ్రి ముభావంగానే వుండి పోయాడు. నాలుగు రోజుల తర్వాత ఉదయం లేచిచూస్తే కొడుకులేడు. అందుబాటులో వున్న తల్లి బంగారు నగలతో మాయం అయ్యాడు. భట్ భరించలేకపోయాడు. కోపంతో ఊగిపోయాడు. పోలీసు రిపోర్టు ఇస్తా నన్నాడు. తల్లి ఆ నగలు తనే కొడిక్కి ఇచ్చినట్టు చెప్పింది. తన భార్య తనతో అబద్ధం చెబుతుందని భట్‌కు తెలుసు. మౌనంగా వుండి పోయాడు.

కొడుక్కి పెళ్ళి చేస్తే బాగుపడ్తాడనే ఆశ ఆ తల్లిదండ్రుల్లో రేకెత్తింది. ఎన్నో సంబంధాలు చూశారు. కాని మర్యాదస్తులెవరూ తమ పిల్లను ఆ ఇంటికి కోడలిగా పంపడానికి అంగీకరించలేదు. దాంతో భట్ మనసు మరీ విరిగి పోయింది. ఆరోగ్యం దెబ్బతిన్నది. రహస్యంగా విల్లు రాశాడు. ఆ సంగతి మహేంద్రకు తెలియదు. ఆ విల్లులో మహేంద్రకు పూచిక పుల్ల కూడా సంక్రమించలేదు. అది అతనికి తెలియదు.

కూతుళ్ళ పెళ్ళిళ్ళ గురించిన చింత మరోవైపు వేధించసాగింది భట్ దంపతులను.

"మధుకుంజ్" కాక భట్‌కు రాజ్‌కోట్‌లో మరో ఇల్లూ, ఒక దుకాణం ఉన్నాయి. వాటిని అమ్మివేయ్యడానికి నిర్ణయించుకున్నాడు భట్. బేరం రెండు లక్షలకు కుదిరింది. ఆ విషయం తెలుసుకొన్న మహేంద్ర తండ్రి దగ్గరకు వచ్చాడు. ఆ రెండు లక్షలూ తనకు ఇవ్వా లన్నాడు. తండ్రి సగం ఇవ్వడానికి అంగీకరించాడు. మరో లక్షతో కూతుళ్ళ పెళ్లిళ్ళు చెయ్యాలన్నాడు. మహేంద్ర అందుకు అంగీకరించలేదు

అలా వచ్చిన వాడు రెండు రోజులు బయట ముఖం చూడకుండా ఇంట్లోనే వుండిపోయాడు.

1981 ఫిబ్రవరి 23వ తేదీన అందరూ భోజనాలుచేసి వారి వారి గదుల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. భట్, తన ఆఫీసు రూంలోనే విశ్రాంతి తీసుకొంటున్నాడు.

సాయంత్రం ఐదున్నరకు మహేంద్ర తల్లితో టీ పెట్టమని చెప్పాడు. అందరూ తండ్రి ఆఫీసు రూంలోనే టీ త్రాగారు కబుర్లు చెప్పుకుంటూ. ఆ తర్వాత తల్లి వంట పనిలో మునిగిపోయింది. పిల్లలు వాళ్ళ వాళ్ల గదుల్లోకి వెళ్లిపోయారు. మహేంద్ర మాత్రం తండ్రికి ఎదురుగా కూర్చునే వున్నాడు.

మళ్లీ రెండు లక్షల విషయం వచ్చింది. తండ్రికొడుకుల మధ్య ఘర్షణ జరిగింది. కోపం పట్టలేని కొడుకు బొడ్లోనుంచి కత్తి లాగి ముసలి తండ్రిమీద దాడి చేశాడు.

"రక్షించండి! రక్షించండి''

ఆర్తనాదం విని ఇంట్లోవాళ్ళు పరిగెత్తుకు వచ్చారు. ఆఫీసు రూంలో రక్తపు మడుగులో పడి వున్న భర్తను చూస్తూనే ''కెవ్వు"న అరచి పడిపోయింది భార్య. పిల్లలు గొల్లుమన్నారు. మహేంద్ర చేతిలోని కత్తికూడా పారెయ్యకుండానే మెరుపులా పారిపోయాడు.

ఏ కొడుకుని అతిగారాబంగా పెంచాడో, ఏకొడుకుమీద అనేక ఆశాసౌధాలను నిర్మించుకున్నాడో, ఏ కొడుకు దేనికీ బాధపడకూడదని వెంపర్లాడాడో, ఆ కొడుకు చేతిలోనే ఆ తండ్రి ధారుణంగా హత్యకు గురి అయ్యాడు.

మహేంద్రకు యావజ్జీవ కారాగార శిక్ష కోర్టు విధించింది.

అయినా ఆఇంట్లో వున్నవాళ్ళు అనుక్షణం ఏదో భయంతో బిక్కు బిక్కుమంటూ బ్రతుకుతున్నారు.

ఇలా ఎందుకు జరిగింది? తల్లిదండ్రుల గారాబం కారణమా? తెలిసీ తెలియని వయసులో పుష్కలంగా అందిన డబ్బు కారణమా?

మీరే ఆలోచించండి.